క్లుప్తంగా

కార్మికులు ప్రమాద బీమా చేసుకోవాలి

రొంపిచెర్ల: కార్మికులందరూ తప్పనిసరిగా ప్రమాద బీమా చేసుకోవాలని పీలేరు డివిజన్ లేబర్ ఆఫీసర్ ఆనందకుమార్ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గ్రామ సచివాలయ వలంటీర్లకు ప్రమాద బీమాపై అవగాహన కల్పించారు. భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందితే ఆ కుటుంబానికి బీమా సంస్థ రూ.5 లక్షలు, సహజ మరణం పొందితే రూ.2లక్షలు వరకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కార్మికులకు ప్రమాద బీమా చేయించాలని సూచించారు. కార్మికులు కూడా దీనికి సంబంధించి సచివాలయ వలంటీర్లను సంప్రదించాలన్నారు.

అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్లకు శిక్షణా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల వారీ చేయవలసిన అభివృద్ధిపై బడ్జెట్ రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదన్నారు. సమావేశంలో బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఓ రాజేశ్వరి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ బుధవారం సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రణాళికల రూపకల్పనలో అనుసరించాల్సిన విధి విధానాలకు ఎంపీడీఓ వివరించారు. అలాగే ఈ నెలాఖరులోపు గ్రామ పంచాయతీలు, ఫిబ్రవరిలోగా మండల పరిషత్‌లో చేపట్టబోయే పనులను ఆమోదింపజేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ ఆత్మగౌరవానికి ప్రతీక

రొంపిచెర్ల: ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డున విజయవాడలో ఈ నెల 19న ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనుండటం భారతదేశ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని జేఏసీ కన్వీనర్ బండపల్లె సుభాష్ అన్నారు. అయన బుధవారం రొంపిచెర్లలో విలేకరులతో మాట్లాడారు. దళితులకు గుర్తింపు ఇచ్చిన వారికి తాము అండగా ఉంటామని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో లోకేష్, చిరంజీవి, రత్నశేఖర్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ


బస్సు వద్ద ఎగబడుతున్న ప్రయాణికులు

సదుం: సంక్రాంతి పండుగ ముగియడంతో స్వస్థలాలకు వచ్చిన వారు తాము స్థిరపడిన ప్రాంతాలకు బయలుదేరడంతో బుధవారం ప్రయాణికుల రద్దీ నెలకుంది. తిరుపతి, పుంగనూరు, పీలేరు ప్రాంతాలకు వెళ్లే బస్సులలో రద్దీ కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

20న మండల సమావేశం

కుప్పం: మండల సర్వసభ్య సమావేశంలో ఈ నెల 20న శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని మండల పరిషత్ అధికారులు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. మండల అభివృద్ధి క్యార్యక్రమలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వరప్రసాద్

సదుం: సమస్యలపై సచివాలయానికి అందే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓ వరప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నడిగడ్డ సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి


బాబునగర్‌లో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. బుధవారం మున్సిపాలిటీలోని బాబునగర్‌లో ఆమె పర్యటించారు. మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను పంపిణీ చేసి మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లుగా కుప్పం ప్రజల మధ్య తమ కుటుంబం అందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు దరికి చేర వేస్తున్నామన్నారు. ప్రజలందరికీ అండగా ఉంటున్న వారినే దీవించాలని, రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.

పట్టు రైతుల ఆందోళన


పలమనేరులో ఆందోళన చేస్తున్న పట్టురైతులు, రీలర్లు

- బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
- ఇప్పటికే కొంతవరకు విడుదలయ్యాయన్న అధికారులు

పలమనేరు: పలమనేరు ప్రాంతానికి చెందిన పట్టు రైతులు, రీలర్లు పెండింగ్‌లోని పట్టుగూళ్ల ఇన్సెంటివ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పట్టుగూళ్ల విక్రయ కేంద్రం వద్ద ఆందోళన చేశారు. రైతులు ఏడూరు గురుమూర్తి, మరికొందరు మాట్లాడారు. తమకు 2019 నుంచి కేంద్ర పట్టుపరిశ్రమశాల కిలో పట్టుగూళ్లకు రైతుకు ప్రోత్సాహంగా ఇచ్చే రూ.50లను సక్రమంగా ఇవ్వడం లేదని, ఇప్పటివరకూ పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్‌లోనే రూ.13 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక ఏడీ కిశోర్ నాయక్‌ను వివరణ కోరగా..ఇటీవలే కొంత మేరకు బకాయిలు విడుదలై రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయన్నారు. కొంత నిధులు సీఎఫ్‌ఎంఎస్‌లో సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలోనే రైతుల ఖాతాల్లోకి జమ అవుతాయని చెప్పారు.

ప్రజల ఆరోగ్యం కోసమే 'జగనన్న సురక్ష'


వైద్యశిబిరం నిర్వహిస్తున్న చైర్మన్, కమిషనర్

పుంగనూరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి, అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని తూర్పు మొగసాల అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరాన్ని కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 349 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో మధుమేహం, రక్తపోటుతో ఎక్కువమంది బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి తెలియజేశారు. అలాగే గర్భవతులకు కూడా వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ రంజిత, పుష్పకుమారి, రాహుల్, జయేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ భావజాలంతో సీఎం


అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : దేశ రాజకీయాల్లో ఎవరికీ లేనివిధంగా ఆంధ్రరాష్ట్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలం కలిగిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసంలో బుధవారం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని మంత్రి ఆవిష్కరించారు. రాజకీయ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కానీ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 206 అడుగుల ఎత్తుతో విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ ప్రవీణ్, పార్టీ నాయకులు నాగేంద్ర, రాజశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


పుష్పపల్లకిలో విహరిస్తున్న అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురం గ్రామంలో వెలసిన ఎల్లమ్మకు కనుమ పండుగ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు ఉభయదారులు తీసుకొచ్చిన పూజాసామగ్రితో అమ్మవారిని పుష్పపల్లకిలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పార్వేట ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా కనుమ పండుగ మరునాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. అక్కడ ఆస్థానం నిర్వహించారు. స్వామివారి వేటను తిలకించడానికి పార్వేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తిరిగి నగర వీధుల్లో ఊరేగింపుగా ఉత్సవమూర్తులను సాయంత్రం 6.30 గంటలకు ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, జేఈఓ వీరబ్రహ్మం, సీఏఓ బాలాజీ, బాలిరెడ్డి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.


ఆస్థానం నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు, అర్చక పండితులు


ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

కమిషనర్‌ను కలిసిన చైర్మన్

కుప్పం: కుప్పం ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాధికను బుధవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న ఆమె ఇక్కడికి బదిలీ అవడం విదితమే. మున్సిపాలిటీలో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు.


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ చైర్మన్

కళాతరంగిణి విద్యార్థుల ప్రతిభ


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

బైరెడ్డిపల్లె: రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా పుట్టపర్తి శిల్పారామంలో బుధవారం రాత్రి జరిగిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో బైరెడ్డిపల్లె కళాతరంగిణి చిన్నారులు ప్రతిభ చాటి ప్రశంసలు అందుకున్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలతో అలరించిన చిన్నారులను జబర్దస్త్ ఆర్టిస్ట్ సునామి సుధాకర్ అభినందించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే చిన్నారులకు శిక్షణ ఇచ్చిన కొరియోగ్రాఫర్, కళా తరంగిణి సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబును సత్కరించారు.

ఘనంగా పశువుల పండుగ


బహుమతులు పంపిణీ చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

సదుం: మండలంలోని మారుతివారిపల్లె గొల్లపల్లెలో పశువుల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. పశువులను అందంగా అలంకరించి వీధుల్లో పరుగులు తీయించారు. వాటిని నిలువరించి వాటికి ఉన్న ఫలకలు దక్కించుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. ఇక, ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనితాకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రమణారెడ్డి, మురళి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



పలమనేరు: పట్టణ సమీపంలోని చిన్నూరు చౌడేశ్వరి ఆలయంలో బుధవారం అగ్ని కుల క్షత్రియ సంఘం–2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు రవి,అగ్ని కుల క్షత్రియ సంఘ నాయకులు శ్రీనివాసన్, మునెప్ప, లక్ష్మయ్య, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. కులంలోని పేదలకు సంఘంలోని సభ్యులు ఏదేనీ సమస్యలున్నప్పుడు అండగా నిలుద్దామని నేతలు పిలుపునిచ్చారు.

కపిలతీర్థంలో కారిడార్ ఏర్పాటు చేయండి

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలో శాశ్వత పురోహితం నిర్వహణ కోసం కారిడార్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని శ్రీకపిలతీర్థం పురోహిత సేవా సంఘం గౌరవ సలహాదారుడు సంస్కార్ రాజేష్, అధ్యక్షుడు ఎ.అనిల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15వ తేదీన కపిలతీర్థంలో పితృదర్పణ కార్యక్రమం నిర్వహణ కోసం టీటీడీ ప్రత్యేక షెడ్లు వేయడంతో పాటు ఏర్పాట్లు చేపట్టడం అభినందనీయమన్నారు.

● బాటగంగమ్మకు పొంగళ్లు


మండలంలోని పాతురునత్తం గ్రామ మహిళలు బుధవారం బాటగంగమ్మకు పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామం నుంచి ఊరేగింపుగా మహిళలు బాటగంగమ్మ ఆలయం వద్దకు వచ్చి పొంగళ్లు వందారు. వర్షాలు బాగా కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. –బైరెడ్డిపల్లె

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా'

పుంగనూరు: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. మండలంలోని ఏతూరులో ఖో-ఖో, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పర్యవేక్షించారు. ఎంపీపీ మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు.


ఏతూరులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

నదుల అనుసంధానం చేయాలని సైకిల్ యాత్ర


సైకిల్‌యాత్ర చేస్తున్న సంజీవి

చిత్తూరు రూరల్: పలు రాష్ట్రాల్లో నదుల అనుసంధానం చేయాలని కోరుతూ సైకిల్ యాత్ర చేస్తున్నట్లు తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా అమమయ్యరుకుప్పల గ్రామానికి చెందిన సంజీవి తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిత్తూరు నుంచి తమిళనాడులోని సేలంకు సైకిల్‌యాత్ర ప్రారంభించారన్నారు. ఒక సత్సంకల్పంతో ఈ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని, ఈ దిశగా పాలకులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల21న సేలంలో నిర్వహించనున్న సదస్సుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ రానున్నారని, నదుల అనుసంధానం విషయాన్ని ఆయన దృష్టి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

108లో ప్రసవం


108లో సుజాతకు కాన్పు చేసి శిశువును అందజేస్తున్న టెక్నీషియన్

గుడిపాల: మండలంలోని చిత్తపారకు చెందిన గర్భిణి సుజాత (21) ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. మంగళవారం అర్ధరాత్రి ఆమెకు పురుటి నొప్పులు రావడంతో 108కు కాల్ చేశారు. 108 వాహనంలో ఆమెను తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో గుడిపాల వద్ద నొప్పులు తీవ్రమయ్యాయి. ఇది గమనించిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివ 108 వాహనంలోనే ఆమెకు సురక్షిత ప్రసవం చేశారు. బుధవారం తెల్లవారుజామున ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం గుడిపాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లి, శిశువు క్షేమంగా ఉన్నారు.

ఆర్యవైశ్యుల వనభోజనం


కన్యకా పరమేశ్వరికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పూతలపట్టు: మండలంలోని ఆర్యవైశ్యులు బుధవారం వన భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పూతలపట్టు జాతీయ రహదారి సమీపంలోని మామిడి తోపులో ఆర్యవైశ్యులు వారి కులదేవత కన్యకా పరమేశ్వరిని పూజించారు. ప్రతి సంవత్సరం కనుమ పండుగ మరుసటి రోజు దేవతలను కొలిచి వన భోజనం కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జగదీశ్వర్‌రెడ్డి, ధర్మకర్త మల్లికార్జునశెట్టి, మునిరాజగుప్త, సురేంద్రబాబు, ప్రత్యుష్, వాసు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

'అనారోగ్యంతో మృతి..ధర్నాలో పాల్గొని కాదు'

చిత్తూరు అగ్రికల్చర్: విజయా డెయిరీ మాజీ కార్మికుడు ఈశ్వర్ మొదలి (70) అనారోగ్యంతో మృతి చెందినట్లు బుధవారం ఆ డెయిరీ కార్మిక సంఘ నాయకుడు కుమార్ స్పష్టం చేశారు. వృద్ధాప్య సమస్యలతో అనారోగ్యం బారిన పదేళ్లుగా ఆయన చికిత్స పొందుతున్నారన్నారు. ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో వారం క్రితం మృతి చెందారన్నారు. అయితే సోషల్ మీడియాలో అతను కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొని మృతి చెందాడని, కార్మికుడు మృతి చెందినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ తన పేరిట చేస్తున్న ప్రచారంలో నిజం లేదని ఖండించారు. శంకర్ మొదలి కార్మికుల దీక్షలో పాల్గొనలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని నమ్మరాదని విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం ఇస్తున్న దుర్గ కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): శ్రీశైలంకు చెందిన దుర్గ బుధవారం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆమె కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం తనిఖీ


క్యాంపును పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: ప్రభుత్వం ఆశయం మేరకు వైద్యులు బాధ్యతతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని డీఎంఅండ్‌హెచ్ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరులోని మాపాక్షిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వైద్యసేవలపై ఆరా తీశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి


ఉద్యోగులను సన్మానిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి


రవాణాశాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న డీటీసీ బసిరెడ్డి

- ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

చిత్తూరు రూరల్: ఆర్టీసీలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు–2 డిపోలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ మనుగడ ఉద్యోగులపై ఆధారపడి ఉందన్నారు. బస్సులు నడపడంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నష్టాలను అధిగమించేందుక ప్రణాళిక ప్రకారం బస్సులను తిప్పాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల జరగకుండా జాగ్రత్త పడాలని, ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం ఆయన ఆదర్శ డ్రైవర్లను సన్మానించారు. ముందుగా డిపో గ్యారేజీని తనిఖీ చేశారు. జిల్లాలో ఆర్టీసీ సమస్యలు, ప్రమాణికుల ఇబ్బందులు, బస్టాండు నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సీఐ అల్తాఫ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి: డీటీసీ

చిత్తూరు రూరల్: రహదారిపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా రవాణశాఖ కార్యాలయంలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. రోడ్డు భద్రత విషయమై డీటీసీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. మానవ తప్పిదాలతోనే 90 శాతం ప్రమాదాలకు దారితీస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలిందన్నారు. మితిమీరిన వేగం, రోడ్డు నియమాలు పాటించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నట్టు చెప్పారు. రహదారి మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనదారులు వాహనాలను నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.